
సాక్షి
వైఎస్సార్ జిల్లా
సోమవారం । 22 । మే । 2023



గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్
కడపలోని ఫాతిమా వైద్య కళాశాల వద్ద గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



వడగండ్లు.. కడగండ్లు
జిల్లాలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వడగండ్ల వాన కురిసింది. పలుచోట్ల చెట్లు నేలకూలాయి. - 8లో



తమ్ముడిపై కత్తితో దాడి
తమ్ముడిపై అన్న కత్తితో దాడిచేసిన సంఘటన జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు గ్రామంలో చోటు చేసుకుంది. - 8లో

భారతి.. సేవా నిరతి

- సీఎస్ఆర్ నిధులతో సేవా కార్యక్రమాలు
- ఏటా రూ.5–6 కోట్లు వెచ్చిస్తున్న భారతి సిమెంటు పరిశ్రమ
- విద్య, వైద్య, డయాలసిస్, తాగునీటి సేవలే ముఖ్యం
- ప్రజలందరి మన్ననలు అందుకుంటున్న యాజమాన్యం



కమలాపురం: 'భారతి' సిమెంట్ పరిశ్రమ సేవా నిరతితో వెలుగొందుతోంది. పరిశ్రమకు సంబంధించిన సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబులిటీ) నిధులతో పరిశ్రమ సమీప గ్రామాల ప్రజలకు విశేష సేవలందిస్తూ నీరాజనాలు అందుకుంటోంది. విద్య, వైద్యం, డయాలసిస్, తాగునీరు, మరుగుదొడ్లు, న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ, ఓల్డేజ్ హోంతో పాటు ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువతీ యువకులకు శిక్షణా కేంద్రాలు నెలకొల్పి ఉపాధి అవకాశాలు మెరుగుకు కృషి చేస్తోంది. వివాహిత మహిళలు, ఏ ఆసరా లేని వారికి తాను ఉన్నాననే భరోసా కల్పిస్తూ టైలరింగ్, ప్లేట్ మేకింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చి వారి జీవన విధానంలో మార్పు తీసుకువస్తోంది భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్. ఈ అంశాలన్నీ ప్రజలకు అందే విధంగా ప్రతి రోజు సీఎంఓ సాయి రమేష్, ఐఆర్ అండ్ పీఆర్ చీఫ్ మేనేజర్ భార్గవ్ రెడ్డిలు పర్యవేక్షిస్తూ పేద ప్రజలకు ఫ్యాక్టరీ తరఫున సేవలు అందిస్తూ ముందుకు సాగుతున్నారు.

న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ
ప్రైమరీ, అంగన్వాడీ సెంటర్ల విద్యార్థులకు భారతి పరిశ్రమ ఏటా రూ.15 లక్షల వ్యయంతో న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ చేస్తోంది. 2016 నుంచి ఈ పంపిణీ సాగుతోంది. పరిశ్రమ పరిధిలోని తిప్పలూరు, నుంకేసుల, తురకపల్లె, పందిళ్లపల్లె, నల్లింగాయపల్లె, అగస్త్యలింగాయపల్లె, జి.కొత్తపల్లె, టి.చదిపిరాళ్ల, కె.అప్పాయపల్లె, రామచంద్రాపురం, జంగంపల్లె గ్రామాల్లో చిన్నారులకు ఈ న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ చేస్తున్నారు.

రూ.10లక్షల వ్యయంతో మోడల్ అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం
నల్లింగాయపల్లె, పందిళ్లపల్లె, తిప్పలూరు గ్రామాల్లో భారతి పరిశ్రమ రూ.10లక్షల వ్యయంతో మోడల్ అంగన్వాడీ కేంద్రాలను నిర్మించింది. వాటి నిర్వహణకు ఏటా రూ.2లక్షలు వెచ్చిస్తోంది.

ఎయిడ్స్ ఉన్న చిన్నారులకు న్యూట్రిషన్ సప్లిమెంటరీ
కడప, ప్రొద్దుటూరులోని ఏఆర్‌టీ సెంటర్ల ద్వారా ఎయిడ్స్ ఉన్న చిన్నారులకు న్యూట్రిషన్ సప్లిమెంటరీ పంపిణీ చేస్తున్నారు. 2015 నుంచి జరుగుతున్న ఈ కార్యక్రమానికి ఏటా రూ.15లక్షల వ్యయం అవుతోంది.

విద్యార్థులకు స్కూల్ బస్
నల్లింగాయపల్లె, జి.అప్పాయపల్లె, సి.రాజుపాళెం, తురకపల్లె గ్రామాల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు భారతి సిమెంటు పరిశ్రమ రూ.12లక్షల వ్యయంతో స్కూల్ బస్సు ఏర్పాటు చేసింది. ప్రతి రోజు విద్యార్థులను బస్సులో ఉచితంగా స్కూల్‌కు పిలుచుకుని వెళ్లి తిరిగి ఇంటికి చేరుస్తారు. వీటితో పాటు రూ.10లక్షల వ్యయంతో ఉచిత వైకుంఠ రథం ఏర్పాటు చేశారు. భారతి పరిశ్రమ 2016 నుంచి సమీప గ్రామాల్లో చెత్త సేకరణ చేపట్టింది. రూ.25లక్షల వ్యయంతో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించింది. చెత్త బుట్టలు పంపిణీ చేశారు.

▶▶ కోటి రూపాయల వ్యయంతో డయాలసిస్ సెంటర్


కమలాపురంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌లో డయాలసిస్ సేవలు అందిస్తున్న సిబ్బంది

కిడ్నీ బాధితుల కోసం 'భారతి' పరిశ్రమ ఆధ్వర్యంలో కమలాపురం క్రాస్ రోడ్డు సమీపంలో ఆర్‌సీఎం చర్చి హాస్పిటల్ ప్రాంగణంలో రూ.కోటి వ్యయంతో 2018లో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశారు. డాక్టర్ రెమిడీస్ సంస్థ పర్యవేక్షణలో డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. ఈ సేవలు బయట పొందాలంటే ఒకసారికి రూ.3వేలు ఖర్చు అవుతుంది. అలాంటిది వారంలో ఒక్కో రోగి 2–3 సార్లు డయాలసిస్ సేవలు ఉచితంగా తీసుకుంటున్నారు. దూర ప్రాంతాల నుంచి రోగులు వస్తున్నారు.

డయాలసిస్ పూర్తిగా ఉచితం




బయట డయాలసిస్ చేసుకోవాలంటే ఒక సారికి రూ.3వేలు అవుతుంది. నేను వారంలో రెండు సార్లు డయాలసిస్ చేసుకుంటాను. పూర్తిగా ఉచితం. బస్సు షెల్టర్ వరకు అంబులెన్స్‌లో వదులుతారు.
–సి. విష్ణువర్ధన్, కిడ్నీ వ్యాధిగ్రస్తుడు, మైదుకూరు

▶▶ అపోలో పర్యవేక్షణలో ఆసుపత్రి నిర్వహణ


భారతి పరిశ్రమ ఎదుట ఏర్పాటు చేసిన అపోలో టెలి క్లినిక్


ప్రముఖ అపోలో హాస్పిటల్స్ పర్యవేక్షణలో 2015లో ఫ్యాక్టరీ ఎదుట రూ. 50లక్షల వ్యయంతో టెలి క్లినిక్ హాస్పిటల్‌ను ఏర్పాటు చేశారు. రోజుకు దాదాపు 70–80 మంది రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఫ్యాక్టరీ సమీప గ్రామాల ప్రజలే కాక కమలాపురం, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు తదితర పట్టణాల నుంచి సైతం రోగులు హాస్పిటల్‌కు వచ్చి వైద్య సేవలు పొందుతుంటారు. ఇప్పటి వరకు 80వేల మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ఏటా రూ.45 లక్షల వ్యయం అవుతోంది.

డాక్టర్లు బాగా చూస్తారు



భారతి పరిశ్రమ ఏర్పాటు చేసిన ఈ హాస్పిటల్‌లో డాక్టర్లు బాగా చూస్తారు. అన్ని రకాల వ్యాధులకు మందులు ఇస్తారు. రక్త పరీక్షలు కూడా చేస్తారు. పూర్తిగా ఉచితంగానే సేవలు అందిస్తున్నారు.
–చంద్రమోహన్ రెడ్డి, నల్లింగాయపల్లె

▶▶ 9 ఆర్‌ఓ ప్లాంట్ల నిర్మాణం


తురకపల్లెలో ఏర్పాటు చేసిన శుద్ధి నీటి ప్లాంట్

నుంకేసుల, తిప్పలూరు, పందిళ్లపల్లె, నల్లింగాయపల్లె, అగస్త్యలింగాయపల్లె, జి.కొత్తపల్లె, టి.చదిపిరాళ్ల, గొల్లపల్లె, జంబాపురం గ్రామాల్లో ఆర్‌ఓ (శుద్ధి నీటి యంత్రాలు) ప్లాంట్లు ఏర్పాటు చేశారు. 2018లో ఒక్కో ప్లాంట్ రూ.5లక్షలతో ఏర్పాటు చేశారు. ఏటా రూ. 4.5 లక్షల వ్యయం అవుతోంది.

▶▶ 900 టాయిలెట్ల నిర్మాణం


జి.కొత్తపల్లెలో నిర్మించిన మరుగుదొడ్డి

ఫ్యాక్టరీ పరిధిలోని 17 గ్రామాల్లో 900 టాయిలెట్లు నిర్మించారు. ఒక్కో యూనిట్ రూ. 45 వేల వ్యయంతో నిర్మించారు. మరుగుదొడ్లు లేని వారందరికి నిర్మించి ఇస్తున్నారు. 2015 నుంచి ఇప్పటి వరకు 900 టాయిలెట్లు నిర్మించారు.

▶▶ కరోనా సాయం కోటి రూపాయలు

కరోనా కష్ట కాలంలో కుటుంబ యజమాని మరణించిన కుటుంబాలను ఆదుకునేందుకు రూ.కోటి ఖర్చు చేశారు. ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేయడంతో పాటు కుటుంబంలో ఒకరికి శిక్షణ నిచ్చి ఉపాధి చూపించారు. అలాగే 25వేల లీటర్ల ఆక్సిజన్ ట్యాంక్‌ను రిమ్స్‌కు అందించారు. యువతీ యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు పొందేలా చూశారు. దీంతోపాటు హైస్కూల్స్‌లో అడ్వాన్స్ కోచింగ్ సెంటర్లు పెట్టి శిక్షణ ఇస్తారు. ఇక నల్లింగాయపల్లె హైస్కూల్‌లో విద్యార్థులకు యూనిఫామ్ మొదలుకొని మౌలిక సదుపాయాలు కల్పించి పాఠశాల అభివృద్ధికి దోహదపడింది భారతి సిమెంటు పరిశ్రమ యాజమాన్యం. ప్రొద్దుటూరు, పులివెందుల తదితర ప్రాంతాల్లో స్పోర్ట్స్, ఆలయాల నిర్మాణాలకు దాదాపు రూ.25లక్షలు వితరణ చేశారు.

సేవలో ప్రథమం మా పరిశ్రమ



సేవా కార్యక్రమాల్లో మా పరిశ్రమ ముందు వరుసలో ఉంటుంది. పరిశ్రమ సమీప గ్రామాల్లోనే కాకుండా అవసరమైన చోట్ల సామాజిక సేవ చేస్తాం. క్షేత్ర స్థాయిలో అవసరమైన సామాజిక సేవ గురించి పరిశ్రమ యాజమాన్యానికి తెలియజేస్తే వారు కచ్చితంగా అనుమతి ఇస్తున్నారు.
–సాయి రమేష్, చీఫ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫీసర్(సీఎంఓ), భారతి పరిశ్రమ.

వ్యాపారం మాత్రమే మా అభిమతం కాదు



కేవలం వ్యాపారం కోసం మాత్రమే మా యాజమాన్యం పరిశ్రమ ఏర్పాటు చేయలేదు. సేవ చేయడం కూడా మా బాధ్యతగా భావిస్తున్నాం. అందుకే సమీప గ్రామాల ప్రజలు ఏది కావాలన్నా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి వాటిని అమలు చేస్తున్నాం. –భార్గవ్ రెడ్డి, చీఫ్ మేనేజర్ ఐఆర్ అండ్ పీఆర్, భారతి పరిశ్రమ

న్యూస్‌రీల్

28న సాహితీ సదస్సు
కడప కల్చరల్: యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈనెల 28వ తేదీన నెలనెల సీమ సాహిత్యం పేరిట సదస్సు నిర్వహించనున్నామని ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, ఇందులో భాగంగా రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర ఉపన్యాసకులు ఐఎల్ఎస్ చంద్రశేఖర్‌రావు ''డాక్టర్ టీజీఆర్ ప్రసాద్ జీవితం–సాహిత్యం' అనే అంశంపై ప్రసంగిస్తారన్నారు.

పెద్దదర్గాను దర్శించుకున్న గాయకుడు


దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న గాయకుడు సల్మాన్ అలీ

కడప కల్చరల్ : ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రమైన కడప అమీన్‌పీర్ దర్గాను ఆదివారం ప్రముఖ గాయకుడు, ఇండియన్ ఐడల్ సీజన్–10 విజేత సల్మాన్ అలీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు దర్గా ప్రతినిధులు స్వాగతం పలికి సంప్రదాయ పేటా ధరింపజేసి దర్గా గురువులను దర్శింపజేశారు. అంతకుముందు హజరత్ పీరుల్లా మాలిక్ మజార్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేయించి ఫాతెహా అనంతరం ప్రసాదాన్ని అందజేశారు. ఆ తర్వాత దర్గాలోని ఇతర గురువుల మజార్లను దర్శించుకున్నారు. దర్గా ప్రతినిధులు ఆయనకు దర్గా చరిత్ర, విశిష్టతలను తెలియజేశారు. గాయకుడు సల్మాన్ అలీ మాట్లాడుతూ దేశంలోనే గొప్ప పేరుగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రమైన కడప పెద్దదర్గాను దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని తెలిపారు.

నేడు జెడ్పీ, డీఆర్సీ సమావేశాలు
కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 9.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ హాజరవుతారు. అలాగే కలెక్టర్ విజయరామరాజుతోపాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు జెడ్పీ ఆవరణలోనే ఉన్న డీపీఆర్సీ భవనంలో జిల్లా సమీక్షా కమిటీ సమావేశం కూడా నిర్వహిస్తున్నారు. ఇన్‌చార్జి మంత్రితోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నారు.

ప్రొద్దుటూరుపై సీఎంకు ప్రత్యేక అభిమానం

- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి
- రూ.233 కోట్ల తాగునీటి పైపులైన్, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి భూమి పూజ


అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రొద్దుటూరు అంటే ప్రత్యేక అభిమానమని.. ఆయన వల్లే మున్సిపాలిటీకి సంబంధించి రెండు ప్రధాన అభివృద్ధి పనులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. రూ.233 కోట్లతో మంజూరైన తాగునీటి పైపులైన్, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవితో కలసి ఆదివారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 70 ఏళ్ల క్రితం మున్సిపాలిటీలో నిర్మించిన పైపులైన్ నిర్మాణం చిలుము పట్టిందన్నారు. సాధారణంగా 30 నుంచి 40 ఏళ్ల వరకు మాత్రమే పైపులైన్ పనిచేస్తుందని, అలాంటిది 70 ఏళ్లు అయినా ఇదే పైపులైన్ ద్వారానే ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నారన్నారు. తనకన్నా ముందు ఎమ్మెల్యేలుగా పని చేసిన నాయకులు ఎందుకు ఈ సమస్య గురించి పట్టించుకోలేదో అర్థం కావడం లేదన్నారు. సీఎం జగన్ పుణ్యాన ఈ అభివృద్ధి పనులు మంజూరు చేయించి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 7 ఓవర్ హెడ్ ట్యాంకులు ఉండగా వీటిలో నాలుగు పాతవని, వీటిని పడగొట్టి నూతనంగా నిర్మిస్తున్నామన్నారు. రూ.120 కోట్లతో అమృత్ పథకం పూర్తయిందని, ప్రస్తుతం ఈ పైపులైన్ నిర్మాణం పూర్తయితే మైలవరం డ్యాం నుంచి సులువుగా అందరికీ నీరు అందుతుందన్నారు. పట్టణాన్ని పట్టి పీడిస్తున్న మరో సమస్య డ్రైనేజీ కాలువలు లేకపోవడమేనని ఎమ్మెల్యే రాచమల్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఈ సమస్యపై తాను అసెంబ్లీలో ప్రస్తావించగా.. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టీడీపీలో చేరితే మంజూరు చేస్తామని తనతో చెప్పారన్నారు. ఇది రాజకీయ వ్యభిచారం కాదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం రూ.163 కోట్లతో డ్రైనేజీ కాలువలు మంజూరయ్యాయని, ఏడాదిన్నరలో ఈ పనులు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. మరో వైపు మున్సిపల్ చైర్‌పర్సన్‌తోపాటు 40 మంది కౌన్సిలర్ల సమష్టి కృషితో రూ.94 కోట్లతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ప్రజారోగ్య శాఖ ఎస్ఈ శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ రూ.119 కోట్ల అంచనాతో స్కాడా సిస్టంలో పైపులైన్ నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపామన్నారు. వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి రాజారాంరెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, టీటీడీ పాలకమండలి సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి పాల్గొన్నారు.

బోగస్ సర్టిఫికెట్లపై డొంక కదులుతోంది

- విచారణ చేపట్టాలని మెడికల్ అండ్ హెల్త్ కమిషనర్ నుంచి జిల్లా ఎస్పీకి ఆదేశాలు
- వివరాలు సేకరించిన పోలీసులు


కడపలోని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం

కడప రూరల్ : కడప వైద్య ఆరోగ్యశాఖ (జోన్–4) ప్రాంతీయ కార్యాలయ పరిధిలో జనవరిలో జరిగిన కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నియామకాల్లో బోగస్ సర్టిఫికెట్లు వెలుగు చూశాయి. ఈ అంశాలపై సాక్షి పలు కథనాలను ప్రచురించింది. ఈ నేపథ్యంలో మెడికల్ అండ్ హెల్త్ కమిషనర్ నివాస్ విచారణ చేపట్టాలని జిల్లా ఎస్పీకి ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు వన్‌టౌన్ పోలీసులు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లి బోగస్ సర్టిఫికెట్లు సమర్పించిన అభ్యర్థుల వివరాలను సేకరించారు. ఇవి బోగస్ సర్టిఫికెట్లని ఇప్పటికే డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వారు నిర్ధారించారు. 16 మందిలో 15 మంది ఉద్యోగాలు పొందారు. బోగస్ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగులోకి రావడంతో ఆ 15 మంది అజ్ఞాతంలోకి వెళ్లారు.

మరికొన్ని బోగస్ సర్టిఫికెట్లు?
స్టాఫ్ నర్సుల నియామకాలకు సంబంధించి జనవరిలో నిర్వహించిన 291 పోస్టులకు గాను రాయలసీమ జిల్లాల నుంచి మొత్తం 11,267 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తుల నుంచి 291 మందిని స్టాఫ్ నర్సులుగా నియమించారు. అందులో 15 మంది బోగస్ అభ్యర్థులు కాగా, వారితోపాటు ఆ వచ్చిన దరఖాస్తుల నుంచే మరికొంత మందిని స్టాఫ్ నర్సులుగా నియమించారు. ఈ రెండవ విడత నియామకాల్లో సర్టిఫికెట్లను పరిశీలించగా, అందులో దాదాపు 10 బోగస్ సర్టిఫికెట్లు బయటపడినట్లుగా సమాచారం. మొత్తం బోగస్ సర్టిఫికెట్లలన్నీ చిత్తూరు జిల్లాకు చెందినవే కాగా, అందులో రెండు మాత్రం కర్నూలు జిల్లాకు చెందినవి ఉన్నట్లుగా తెలిసింది. ఈ వ్యవహారం రాయలసీమ జిల్లాలతోపాటు ఉన్నతాధికారుల్లో చర్చనీయాంశంగా మారింది. లోతుగా విచారణ నిర్వహిస్తే ఆసక్తికరమైన వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉందని ఆ శాఖ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఇటీవలనే వైద్య ఆరోగ్యశాఖ ఇన్‌చార్జి రీజినల్ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ కోటేశ్వరి పదోన్నతిపై అడిషనల్ డైరెక్టర్‌గా అమరావతికి వెళ్లారు. ఈ స్థానంలోకి అమరావతిలో అడిషనల్ డైరెక్టర్ (మాతాశిశు సంరక్షణ)గా పనిచేస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్ రీజినల్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఇప్పుడు ఆయనకు ఈ అంశాలన్నీ సవాలుగా మారాయి. ఆయన తీసుకునే నిర్ణయాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే ఉండాలి

కడప కల్చరల్ : స్పందన కార్యక్రమంలో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే ఉండాలని అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య అన్నారు. ఆదివారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో ప్రజ లు తమ సమస్యల పరిష్కారం కోసం ఫిర్యా దులు ఇస్తుంటారని, అవన్నీ తెలుగులోనే ఇవ్వా లని సూచించారు. అలాగే అధికారుల నుంచి వచ్చే పరిష్కార లేఖలు కూడా తెలుగులోనే ఉండాలని ఆయన కోరారు. తెలుగుభాష పక్కాగా అమలు చేయడం కోసం అధికారభాషా సంఘం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని, ఇందుకోసం కార్యాచరణ రూపొందిస్తున్నామని వివరించారు.


ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదం కోసమే ట్రెక్కింగ్

కడప డీఎఫ్ఓ పి.వి సందీప్ రెడ్డి



ట్రెక్కింగ్‌ను ప్రారంభిస్తున్న కడప కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, కడప డీఎఫ్ఓ పి.వి సందీప్ రెడ్డి

కడప అర్బన్: ప్రజలకు ఆరోగ్యంతో పాటు, ఆహ్లాదం అందించేందు కోసమే ప్రతి ఆదివారం ట్రెక్కింగ్‌ను నిర్వహిస్తున్నామని కడప డీఎఫ్ఓ పి.వి సందీప్ రెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరంలోని రామస్వామికోన ప్రదేశం వద్ద నుంచి ఆకుపచ్చ జెండా ఊపి ట్రెక్కింగ్‌ను డీఎఫ్ఓతో పాటు కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరవనం నుంచి పాలకొండలు గుడి వరకు ఐదు కిలోమీటర్ల ట్రెక్కింగ్‌ను ప్రతి ఆదివారం నిర్వహించదలిచామన్నారు. ట్రెక్కింగ్ చేయడం వలన ప్రజలకు చక్కటి అనుభూతితో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. అడవుల ప్రాధాన్యత ప్రజలకు తెలియజేయడం కూడా మరో ఉద్దేశమన్నారు. అడవులకు నిప్పు పెట్టడం, అటవీ సంపదను దోచుకోవడం వలన పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అడవులను కాపాడుకోవడం ప్రజలందరూ తమ బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఎఫ్ఆర్ఓ బాలసుబ్రమణ్యం, ట్రైనీ రేంజర్ కళావతి, డిప్యూటీ రేంజర్లు ఎస్. ఓబులేసు, కరీముల్లా, ఎఫ్ఎస్ఓలు శ్రీనివాసులు, షకీల్ అహ్మద్, కడప అటవీశాఖ సిబ్బంది, నగర పాలక సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వెలుగు జిలుగులు



- ఆర్టీపీపీలో అన్ని యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి
- 6 యూనిట్లకు రోజుకు 20 మెట్రిక్ టన్నుల బొగ్గు
- 1650 మెగావాట్లకు 1306 మెగావాట్ల ఉత్పత్తి
- పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ఆర్టీపీపీ సిద్ధం




ఆర్టీపీపీ (ఇన్‌సెట్) ఆర్టీపీపీలో యూనిట్ల వారీగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం

ఎర్రగుంట్ల: రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో వేసవిలో విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ఉత్పత్తి జరుగుతోంది. అవసరాల మేరకు పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ఆర్టీపీపీని సిద్ధంగా ఉంచారు. ప్రస్తుతం ఏపీజెన్‌కో యాజమాన్యం ఆదేశాలతో బ్యాక్ డౌన్‌లో విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. ప్రస్తుతం ఆర్టీపీపీలో 1650 మెగావాట్లకు గాను 1306 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని అధికారులు తెలిపారు.

- ఆర్టీపీపీలో ఉన్న 1, 2, 3, 4, 5, 6 యూనిట్లలో 1650 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. ఆర్టీపీపీలో ఉన్న 6 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి జరగాలంటే రోజుకు సుమారు 20 మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు అవసరం. కానీ ప్రస్తుతం ఆర్టీపీపీలో రెండు రోజులకు సరిపడే బొగ్గు నిల్వలు ఉన్నాయి.
- ప్రస్తుతం వేసవి కాలంలో ఉక్కపోతను తట్టుకోవడం కోసం ప్రతి ఇంటా విద్యుత్‌ను అధికంగా వాడుతున్నారు. దీనికి తగ్గట్టుగా ఏపీజెన్‌కో యాజమాన్యం విద్యుత్ ఉత్పత్తిని అన్ని థర్మల్ పవర్ ప్లాంట్‌లలో వినియోగానికి మించి చేస్తోంది. అందులో భాగంగానే ఆర్టీపీపీలో ప్రస్తుతం 1306 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతోంది.
- ప్రస్తుతం బ్యాక్‌డౌన్‌లో ఉన్న యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి పూర్తి స్థాయిలో లోడ్ ఊయడానికి ఆర్టీపీపీ సిద్ధంగా ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కలసపాడు : మండలంలోని తెల్లపాడుకు చెందిన మాలేపాటినరసింహులు (55) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు నరసింహులు మండలంలోని ఎగువ రామాపురంలో జరిగిన జాతరకు హాజరయ్యాడు. తన అల్లుడి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. తంబళ్ళపల్లె, సింగరాయపల్లె గ్రామాల మధ్య గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నరసింహులు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం ఓ వాహనంలో కడపకు తీసుకెళుతుండగా మైదుకూరు వద్ద మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

పోరుమామిళ్ల : మండలంలోని రామేశ్వరంలో శనివారం సాయంత్రం ఓంకారం పెద్ద వెంకటరాజు (68) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మృతుడి చిన్న కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ చెప్పారు. మృతుడి భార్య 2019లో చనిపోయింది. అప్పటినుంచి ఒంటరిగా ఉంటూ జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు.

తమ్ముడిపై కత్తితో దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇంతియాజ్

జమ్మలమడుగు రూరల్ : తమ్ముడిపై అన్న కత్తితో దాడిచేసిన సంఘటన జమ్మలమడుగు మండలంలోని గూడెంచెరువు గ్రామంలో చోటు చేసుకొంది. పట్టణ సీఐ సదా శివయ్య కథనం మేరకు ఇంతియాజ్, అన్వర్‌బాషాలు అన్నదమ్ములు. వీరిద్దరు పండ్ల వ్యాపారం చేస్తుంటారు. రెండురోజుల కిందట ఇద్దరి మధ్య కుటుంబ కలహాలు ఏర్పడ్డాయి. శనివారం రాత్రి అన్వర్ బాషా ఇంతియాజ్‌పై కత్తితో ఛాతీపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఇంతియాజ్‌ను జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపకు తీసుకెళ్లారు.

వడగండ్లు.. కడగండ్లు



కడపలో వర్షం వల్ల రహదారులపై నిలిచిన నీరు



కడపలోని గురుకుల్ విద్యాపీఠ్ ఎదుట కూలిపోయిన చెట్టు

- జిల్లాలో ఈదురుగాలు, ఉరుములు, మెరుపులతో వర్షం
- పలుచోట్ల నేలకూలిన చెట్లు, స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

కడప కార్పొరేషన్ : ఆదివారం సాయంత్రం జిల్లాలో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వడగండ్ల వాన కురిసింది. పలుచోట్ల చెట్లు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. ఫలితంగా చాలాచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉన్నట్టుండి కురిసిన వాన వల్ల పాదచారులు, వాహన చోదకులు, తోపుడు బండ్ల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కడపలో వానవల్ల ఆర్టీసీ బస్టాండు, ఆర్ఎం కార్యాలయం, పక్కీరుపల్లె రోడ్డు, గురుకుల్ విద్యాపీఠ్, వినాయకనగర్, ప్రాంతాల్లో రహదారులపై నీరు నిలిచింది. గురుకుల్ విద్యాపీఠ్ ఎదుట ఒక ఎండు చెట్టు కూలిపోగా, తిరుపతి రోడ్డులో వైఎస్సార్ సర్కిల్ వద్ద ఒక చెట్టు ఒరిగిపోయి ఏ క్షణమైనా కూలేందుకు సిద్ధంగా ఉంది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది.

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంతంలో ఆదివారం సాయంత్ర భారీ వర్షం కురిసింది. మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణ పల్లె గ్రామంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులకు విద్యుత్ వైర్లు తెగి ఇంటి మీద పడ్డాయి. ఇంటిలో ఎవరూ లేక పోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. భారీ వర్షానికి పులివెందుల చుట్టూ ఉన్న వాగులు, గుంతలు నిండి పోయాయి.

రేకుల షెడ్డు ధ్వంసం

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల, నేలతిమ్మాయపల్లె గ్రామాల్లో గాలులకు విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరిగాయి.చెరుకు తోటలో పిడుగు పడటంతో కొంతమేర పంటనష్టం వాటిల్లింది. నేలతిమ్మాయపల్లె ఇటుకల బట్టీ వద్ద ఉన్న కూలీలు ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్ ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి కూలీలకు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆశ్రయం కల్పించారు. అనిమెలలో వివత్తును సంగమేశ్వర దేవస్థానం చైర్మన్ శివాంజనేయరెడ్డి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తగిన చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జమ్మలమడుగు ప్రాంతంలో చినుకులు పడినప్పటికీ పెనుగాలులు వీచాయి. ఇక్కడ పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందింది. మైదుకూరులో గాలులకు ప్రధానంగా విద్యుత్ సరఫరా అందించే తీగలు తెగిపడడంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొండాపురం మండలం శిరిగేపల్లె గ్రామానికి చెందిన రైతు అల్లపురెడ్డి వెంకట శివారెడ్డికు చెందిన ఎద్దు కల్లం దొడ్డిలో పిడుగుపాటుకు మృతి చెందింది.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి



గుర్రప్ప (ఫైల్)

కలసపాడు : మండలంలోని తెల్లపాడు గ్రామానికి చెందిన కాకర్లగుర్రప్ప (40) ఆదివారం పిడుగుపడి మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు గుర్రప్ప గొర్రెలను తోలుకుని నేల్లకుంట సమీపంలో మేపుకుంటుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో సమీపంలోని చెట్టు కిందికి వెళ్లాడు. చెట్టుపైన పిడుగు పడటంతో గుర్రప్ప అక్కడికక్కడే మృతి చెందాడు.మృతునికి భార్య రమాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గోడకూలి.. విద్యుత్‌షాక్‌కు గురై..



చిన్నసుబ్బయ్య మృతదేహం

గోపవరం : మండలంలోని శ్రీనివాసపురంలో ఆదివారం మధ్యాహ్నం గాలివాన భీభత్సానికి బేతాయపల్లె గ్రామానికి చెందిన మచ్చచిన్నసుబ్బయ్య (55) అనే వ్యక్తి మృతిచెందాడు. వివరాలు..చిన్నసుబ్బయ్య బద్వేలు నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళుతుండగా శ్రీనివాసపురం వద్దకు రాగనే ఒక్కసారిగా గాలివాన వచ్చింది. తలదాచుకునేందుకు హైవే రోడ్డు పక్కనే తాత్కాలిక షెడ్డు వద్దకు చేరుకున్నాడు. అదే సమయంలో పెద్ద ఎత్తున గాలి వీచడంతో తాత్కాలిక షెడ్డు రేకులు ఎగిరిపడి అక్కడే ఉన్న విద్యుత్ లైన్ తాకుతూ రోడ్డుకు అటువైపు పడ్డాయి. షెడ్డు గోడతోపాటు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. చిన్నసుబ్బయ్యపై గోడ కూలడం, విద్యుత్‌షాక్‌కు గురికావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనస్థలానికి చేరుకుని బోరుబోరున విలపించారు. కాగా ఎలాంటి అనుమతి లేకుండా నేషనల్ హైవే రోడ్డు పక్కనే తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేయడం వల్లే ప్రమాదం జరిగిందని మృతుడి బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బద్వేలు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వారికి నచ్చజెప్పారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. చిన్నసుబ్బయ్య కుమారుడు బద్వేలు అర్బన్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు.



పులివెందుల: బ్రాహ్మణపల్లెలో ఇంటి మీద పడి ఉన్న విద్యుత్ వైర్లు,చెట్టు



వీరపునాయునిపల్లె : ట్రాక్టర్‌పై పడిన భారీ వృక్షం



పులివెందులలో రోడ్లపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

వివాహిత ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని శ్రీనివాసపురంలో ప్రశాంతి (27) అనే వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. త్రీ టౌన్ పోలీసుల కథనం మేరకు సుధాకర్, ప్రశాంతిలకు 8 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అతను కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే ఇటీవల సుధాకర్ మద్యానికి బానిసయ్యాడు. తరచూ మద్యం తాగి ఇంటికి వస్తుండటంతో ఆమె భర్తతో గొడవ పడేది. భర్త తాగుడుకు బానిసయ్యాడని, పైగా తమకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని కలత చెందిన ఆమె శనివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణంరాజునాయక్ తెలిపారు.

తేనెటీగల దాడిలో రైతుకు తీవ్రగాయాలు

మదనపల్లె : తేనెటీగల దాడిలో ఓ రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లె మండలం చిప్పిలిలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు వెంకటరమణ(55) పొలం వద్ద కొడవలితో కంపచెట్లు నరుకుతుండగా చెట్లలో ఉన్న తేనెటీగల గుంపు ఒక్కసారిగా పైకిలేచి దాడిచేశాయి. ఘటనలో వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డాడు.

ఇరువర్గాల ఘర్షణ

చిట్వేలి : రాములవారి ఉత్సవాల నేపథ్యంలో మండల పరిధిలోని పోలోపల్లి గ్రామంలో ఇరువర్గాల మధ్య ఆదివారం ఘర్షణ చోటుచేసుకుంది. ఈ మేరకు శ్రీరాముల ఉత్సవాలపై 20 రోజులుగా గ్రామంలోని రెండు సామాజికవర్గాల మధ్య తలెత్తిన వివాదంపై పోలీసు అధికారుల ఆదేశాల మేరకు ఆలయం దగ్గర పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఆదివారం మధ్యాహ్నం కుల పెద్దలు చర్చిస్తున్న సమయంలో ఇరువర్గాల మధ్య మాటమాట పెరిగి ఉద్రిక్తతకు దారితీసింది. రాళ్లు విసురుకోవడంతో స్థానిక హోంగార్డు డి చంద్రశేఖర్, గ్రామానికి చెందిన రాజుల తలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ చైతన్య, సీఐ విశ్వనాథరెడ్డి, రాజంపేట ఎస్ఐ వెంకటేశ్వర్లు స్థానిక ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ సిబ్బందితో కలిసి గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఒంటిమిట్ట : ఇబ్రహింపేట గ్రామ సమీపంలో ఉన్న ఓబులేసు కోన ప్రాంతంలో శనివారం ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఆదివారం ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్ రెడ్డి పలువురిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. శనివారం ఓబులేసు కోన ప్రాంతంల్లో భూమికి సంబంధించి కూర్ల ఓబుల్ రెడ్డి, మట్లి నారాయణ రెడ్డి వర్గాలు ఘర్షణ పడ్డారు. వీరు బహిరంగ ప్రదేశంలో గొడవ పడి, ప్రజల శాంతి భద్రతలకు ఆటంకం కలిగించారు. దీంతో ఓబుల్ రెడ్డితో కలిపి ఏడుగురిపై, మట్లి నారాయణరెడ్డితో కలిపి ఏడుగురిపై కేసు నమోదు చేసి నట్లు తెలిపారు.

మద్యానికి బానిసై.. యువకుడి ఆత్మహత్య



భాస్కర్ మృతదేహం

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో అవుల భాస్కర్(31)అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ చంద్రమోహన్ కథనం మేరకు మండలంలోని దేనేపల్లెకు చెందిన భాస్కర్ కొన్ని సంవత్సరాల క్రితం ఉప్పలూరుకు చెందిన శ్రీదేవితో వివాహమైంది. సుమారు ఏడాదిన్నర నుంచి అక్కడే నివాసం ఉంటున్నాడు. అతను మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో తరచూ గొడవ పడుతుండేవాడు. శనివారం రాత్రి 10 గంటల వరకు ఇంటి బయట పడుకునే ఉన్నాడు. అనంతరం లోపలికి వెళ్లాడు. ఆదివారం ఉదయం 6గంటల సమయంలో ఆతని భార్య ఇంటిలోకి వెళ్లి చూడగా భాస్కర్ ఉరి వేసుకుని చనిపోయినట్లు గుర్తించింది. భాస్కర్ సోదరుడు మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా భాస్కర్ భార్య ప్రస్తుతం గర్భిణీ అని బంధువులు తెలిపారు.

మొబైల్ షాపు యజమానికి జరిమానా

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని క్లాసిక్ మొబైల్ షాపు యజమానికి జిల్లా వినియోగదారుల ఫోరం జరిమానా విధించింది. మొబైల్ కొనుగోలు చేసి మోసపోయిన కరుణాకర్ అనే వ్యక్తి ఆదివారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించాడు. అతను 2019లో ప్రొద్దుటూరులోని గాంధీరోడ్డులో గల క్లాసిక్ మొబైల్ షాపులో వీవోవై711 మొబైల్‌ను రూ. 8,990కి కొన్నాడు. అయితే ఆ మొబైల్ తరచూ స్విచ్ఛాప్ అవుతుండటంతో తిరిగి అదే షాపునకు వెళ్లి చూపించాడు. అయితే వారు కడపలోని సర్వీస్ సెంటర్‌లో చూపించుకోవాలని సలహా ఇచ్చారు. కడపలోని వివో ఆథరైజ్డ్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి మొబైల్ చూపించగా ఇన్‌వాయిస్ నంబర్ తేడా ఉందని అందువల్ల ఈ మొబైల్‌కు వారంటీ వర్తించదని చెప్పారు. దీంతో పాత మొబైల్‌ను కొత్త మొబైల్‌గా తనకు విక్రయించారని భావించిన కరుణాకర్ జిల్లా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశాడు. అయితే కరోనా కారణంగా అప్పటి నుంచి ఈ కేసు వాయిదా పడుతూ వచ్చింది. ఈ క్రమంలో ఈ నెల 18న మొబైల్ షాపు నిర్వాహకునికి జరిమానా విధిస్తూ వినియోదారుల ఫోరం తుది తీర్పు ఇచ్చింది. బాధితునికి మొబైల్ ధర రూ.8,890 చెల్లించడంతో పాటు ఫిర్యాదు చేసిన నాటి ఈ మొత్తానికి 6 శాతం వడ్డీ కలిపి ఇవ్వాలని కమిషన్ తీర్పులో వెల్లడించారు. అంతేగాక మానసిక వేదన కింద రూ.1000, ఖర్చులకు రూ. 500 చెల్లించాలని తీర్పు ఇచ్చినట్లు కరుణాకర్ తెలిపాడు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబకలహాలతో మనస్తాపం చెంది ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించిన ఘటన ఆదివారం పట్టణంలో జరిగింది. నీరుగట్టువారిపల్లెకు చెందిన రమణమ్మ(45) కూలిపనులు చేసుకుంటూ జీవనం చేస్తోంది. ఈ నేపథ్యంలో కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఈమె ఆదివారం పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు బాధితురాలిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్



నిందితులు, గంజాయి ప్యాకెట్లతో కడప తాలూకా సీఐ ఉలసయ్య తదితరులు

కడప అర్బన్ : కడపలోని ఫాతిమా వైద్య కళాశాల సమీపంలో రైల్వే ట్రాక్ ప్రాంతంలో కంపచెట్ల మధ్య గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు.వారి వద్ద నుంచి దాదాపు 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఆదివారం కడపలోని తాలూకా పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ ఉలసయ్య విలేకరులకు వెల్లడించారు. అరెస్టయిన వారిలో కడప నగరం రామరాజుపల్లిలో నివాసం ఉంటూ, తిరుమల రైల్వే బోగి క్లీనర్‌గా పని చేస్తున్న శ్రీరామ్ నర్సింహులు, సిద్దవటంలోని దిగువపేట, గాంధీస్ట్రీట్‌కు చెందిన, వైన్‌షాపులో సేల్స్‌బాయ్‌గా పనిచేస్తున్న కోటపాటి ప్రేమ్‌కుమార్, సిద్దవటం మండలం కొత్త మాధవరంగ్రామం, స్టేట్‌బ్యాంక్ వీధిలో నివాసం ఉంటున్న కందుల సాయినాథ్‌లు ఉన్నారు. ఈ సంఘటనలో శ్రీరామ్ నర్సింహులుకు రైలు బోగీలో 4 గంజాయి ప్యాకెట్లు కలిగిన మూడు సంచులు దొరికాయి. మూడు సంచుల్లో 12 గంజాయి ప్యాకెట్లను ముగ్గురు నిందితులు 4 ప్యాకెట్ల చొప్పున పంచుకున్నారు. విక్రయించే ప్రయత్నం చేస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన కడప తాలూకా సీఐ ఉలసయ్య, ఎస్ఐలు బి. రామకృష్ణ, తాహిర్‌హుసేన్, ఏఎస్ఐలు పి. వెంకటేశ్వర్లు, పి. శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు కిరణ్ కుమార్‌నాయక్, ప్రసన్నకుమార్, పుల్లయ్య, శ్రీనివాసులను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, కడప డీఎస్పీ ఎండీ షరీఫ్‌లు అభినందించారు.

భూమిని అన్యాక్రాంతం చేస్తున్నారని ఎస్పీకి ఫిర్యాదు

కడప అర్బన్ : జిల్లాలోని చెన్నూరు మండలం చిన్న మాచుపల్లి గ్రామ పొలంలోని సర్వే నెంబరు. 407/02 లో 5.09 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూమిని కడప నగరంలోని ఎస్‌బీఐ కాలనీలో నివాసం వుంటున్న భూమిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డి కొనుగోలు చేశాడు. అయితే ఈ భూమిని స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి తన భార్య రేవతి పేరుమీద కొనుగోలు చేసుకున్నట్లు దొంగ డాక్యుమెంట్లు సృష్టించి భూమిని అక్రమంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు ఆదివారం బాధితుడు ఒక ప్రకటనలో తెలిపారు. సదరు భూమిని జమ్మలమడుగులోని పండేటి జీవన్‌కుమార్, అతని అన్న పండేటి పుష్పరాజ్‌ల నుంచి తన భార్య పేరు మీదుగా కొనుగోలు చేసినట్లు దొంగ డాక్యుమెంట్లు సృష్టించాడని ఆరోపించారు. ఈ విషయమై హైకోర్టును ఆశ్రయించామని, తర్వాత తమకు జరిగిన అన్యాయంపై ఈనెల 18న జిల్లా ఎస్పీకి విన్నవించామన్నారు. ఈ విషయమై ఇదివరకు చెన్నూరు పోలీసులు పిలిపించి విచారించారన్నారు. తర్వాత తమ పేరు మీద పొలంలో బోర్లును ఏర్పాటు చేసుకున్నామని, ఆ బోర్లును స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌తో పాటు ముగ్గురు అనుచరులతో కలిసి తాము నాటిని బోర్లును తొలగించారు. న్యాయస్థానం ఉత్తర్వులను ధిక్కరిస్తూ సదరు భూమిని కాజేయాలనీ దురుద్దేశంతో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. తమకు న్యాయం చేయాలనీ విజ్ఞప్తి చేశారు.

సీమ' అస్తిత్వ 'సాధన' ప్రస్థానమే నా నవల

పుస్తక పరిచయ సభలో రచయిత శాంతి నారాయణ



'సాధన 'నవలను ఆవిష్కరిస్తున్న అతిథులు

కడప కల్చరల్ : అస్తిత్వ సాధన కోసం జరిగిన, జరుగుతున్న సీమ ప్రస్థానం గురించి తెలిపేందుకే సాధన నవల రాశానని ప్రముఖ కథ, నవల రచయిత శాంతి నారాయణ అన్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 'సాధన' నవల పరిచయ సభలో ఆయన తన రచనకు ప్రేరణ ఇచ్చిన అంశాల గురించి తెలిపారు. 80 సంవత్సరాలుగా సీమకు అన్యాయం జరుగుతోందన్నారు. ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు, భాష, ఆహారం, జీవన విధానాన్ని రాష్ట్రంలోని ఇతర ప్రాంతీయులు ఎద్దేవా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమాల్లో మనను హింసా వాదులుగా చూపుతూనే ఉండడం అన్యాయమన్నారు. డాక్టర్ వైఎస్సార్, ఎన్టీ రామారావు మాత్రమే సీమకు న్యాయం చేసేందుకు కృషి చేశారన్నారు. ఈ వివక్షను నేటి తరానికి తెలిపేందుకే సాధన నవల రాశానన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇతర అతిథులతో కలిసి నవలను ఆవిష్కరించారు.

ముఖ్య అతిథి, బీసీ సంక్షేమశాఖ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రపంచీకరణ ప్రభావంతో నేటితరం అభివృద్ధిని ఆర్థికంగానే చూస్తోందని, తామేం కోల్పోతున్నామో వారికి తెలియకపోవడం బాధాకరమన్నారు. అవగాహన లోపంతోనే ముఖ్యమైన అంశాలలో యువత వెనుకబాటుతనం కనిపిస్తోందన్నారు. ప్రజా శ్రేయస్సును కోరేదే నిజమైన సాహిత్యమని సభాధ్యక్షుడు డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. సాధన నవలతో రచయిత సార్థకత సాధించారన్నారు. ప్రధాన వక్త డాక్టర్ కె.నాగేశ్వరాచారి నవలను పరిచయం చేసి సమీక్షించారు. నిద్రాణంగా ఉన్న సమాజాన్ని జాగృతం చేసేందుకు మన ప్రాంత అస్తిత్వంపై జరుగుతున్న దాడికి సరైన సమాధానం ఇచ్చేందుకు డాక్టర్ శాంతి నారాయణ రచించిన సాధన నవల ఈ రంగంలో కొత్త ఒరవడిని సృష్టించిందని, సీమకు ద్రోహం చేసిన వారిని ఈ నవల వేలెత్తి చూపుతోందన్నారు. గౌరవ అతిథులు డాక్టర్ వేంపల్లె షరీఫ్, ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ మానస చిన్నపరెడ్డి సాధన నవల నిర్మాణంలో గల శ్రమను వివరించారు. సీమ అస్తిత్వ సాధన పోరాటాన్ని ఈ నవల ప్రతిబింబిస్తోందని, అడుగడుగునా అన్యాయానికి గురవుతున్న సీమ వ్యథను తెలుపుతోందన్నారు. డాక్టర్ జీవీ సాయిప్రసాద్ ఈ నవల గురించి కళాశాల విద్యార్థులకు వివరించి వారిని భాగస్వాములను చేయాలని కోరారు. నిర్వాహకులు ఈ సందర్భంగా రచయిత, అతిథులను ఘనంగా సత్కరించారు.

హత్యకేసులో నిందితులు అరెస్ట్

పీలేరు : రెండు రోజుల క్రితం అన్నమయ్య జిల్లా పీలేరులో జరిగిన షేక్ మహమ్మద్‌అలి హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా కథనం మేరకు పీలేరులో నివాసం ఉంటున్న షేక్ మహమ్మద్‌అలి అన్న కుమార్తెను స్థానిక బండ్లవంకకు చెందిన కారంశెట్టి భరత్ (22) ప్రేమిస్తున్నానంటూ వెంటపడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 18న బెంగళూరు నుంచి పీలేరుకు వచ్చిన మహమ్మద్‌అలి అన్న కుమార్తెకు ఫోన్ చేసి తనను ప్రేమించకుంటే మీ అంతు చూస్తానంటూ బెదిరించాడు. ఆ ఫోన్ తీసుకున్న అమ్మాయి తల్లి షమీం తన మరిది అయిన మహమ్మద్ అలికి ఫోన్ ఇచ్చింది. దీంతో ఎందుకు మా కుమార్తె వెంట పడుతున్నావని మందలించగా కోపోద్రిక్తుడైన భరత్, తన స్నేహితుడు కె. కుమార్ (24)తో కలిసి మహమ్మద్‌అలి వద్దకు వెళ్లారు. అతనిపై కత్తితో దాడి చేయగా రక్తపుమడుగులో కుప్పకూలిపోయాడు. అడ్డు వచ్చిన అతని భార్య, తండ్రిపై ఇటుకలతో దాడి చేశారు. మహమ్మద్‌అలిని ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఆదివారం నిందితులు భరత్, కుమార్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ద్విచక్రవాహనం, కత్తి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.